7

# నువ్వు + నేను = మనం

తెల్లవారు ఝామున నాలుగు గంటలపుడు కుళాయిలో నీళ్ళు వస్తున్న శబ్దం వినబడి నిద్ర లేచాడు శ్రీపతి.

గబగబ వంట ఇంట్లోకి వెళ్ళి స్టీలు బిందెలోని నీళ్ళు సింక్‌లోకి ఒంపేసి బిందె తీసుకెళ్ళి కుళాయి క్రింద పెట్టాడు.

నిద్రలేకపోవడం వలన కాబోలు కళ్ళు మంట పెడుతున్నాయతనికి. రాత్రి పడుకునేసరికి ఇంచుమించు రెండు గంటలయింది.

శ్రీపతికి పెళ్ళయి రెండేళ్ళయింది భార్య సంధ్య చక్కనిదే కాక చదువుకున్నదీ గుణవంతురాలు కూడ.

అయితే ముందు రోజు రాత్రి పడుకోవడం ఆలస్యం కావడానికి కారణం ఆలుమగల ప్రణయలీలలు కాదు.

చిన్న తగవుగా ప్రారంభమై చిలికి చిలికి గాలివానగా మారి కాటుక కంటినీరు చనుకట్టుపై పడటంతో ఆగక, మంచాలు దూరం జరుపుకునేదాక పెరిగింది.

సన్న సన్నగా వినబడుతున్న కలకంఠి వెక్కిళ్ళు మనసును కలవర పెడుతుంటే ఎపుడో నిద్ర పట్టింది. ఇంతలోకీ కుళాయిలో నీళ్ళు వచ్చే టైమయ్యింది.

నీళ్ళ శబ్దానికి సంధ్య నిద్ర లేస్తుందేమోనని నీళ్ళు బిందె అంచును తాకి లోపల పడేట్టు బిందెను జరిపాడు శ్రీపతి.

ఈ రెండు బిందెలూ పట్టేసాక కనీసం ఒక గంటసేపైనా నిద్ర పోకపోతే ఇవాళ బ్యాంకులో లెక్కలు తప్పుల తడకలే' అనుకుంటూ నిండిన బిందెను తీసుకెళ్ళి వంటింట్లో స్టీలు డ్రమ్‌లో నీళ్ళుపోసి మళ్ళీ కుళాయి క్రింద పెట్టాడు బిందెను.

సరిగ్గా అదే నిముషంలో గేటు ముందు రెండు రిక్షాలు ఆగాయి.

ఆ రిక్షాలలో నుండి దిగుతున్న అమ్మనూ, నాన్ననూ, చెల్లెలినీ చూడగానే శ్రీపతి గుండె క్షణకాలం కర్తవ్యాన్ని మర్చిపోయింది.

ఆరు నెలల తరువాత వాళ్ళను చూస్తున్నానన్న ఆనందం కన్నా రాకరాక ఈరోజే రావాలా వీళ్ళు అన్న దిగులే ఎక్కువ చోటు నాక్రమించుకుంది అతని గుండెలో.

నీళ్ళ మాట మరిచిపోయి గేటు దగ్గరికి పరిగెత్తి "ఏమిటిలా చెప్పా పెట్టకుండా

వచ్చారూ? లోపలికి రండి. రిక్షాకి డబ్బులు నేనిస్తాలే" అంటూ బయటకు నడవ సంకల్పించి గేటు తాళం వేసి వుందని గుర్తొచ్చి స్పీడుగా ఇంట్లోకి పరిగెత్తి తాళం చెవి తీసుకొచ్చి తాళం తీసి తల్లి చేతిలోని సంచీని అందుకున్నాడు.

అందర్నీ పేరు పేరునా కుశల ప్రశ్నలు వేస్తున్నాడేగానీ అతని మనసంతా సంధ్య రియాక్షన్ ఎలా వుంటుందోనన్న ఆందోళనతో నిండిపోయింది.

చెల్లెలికి ఆ ఊళ్ళో పెళ్ళి సంబంధం చూసేరట. ఇవాళ చూపులు ఇక్కడే ఏర్పాటు చేయాలని వచ్చేరుట.

శ్రీపతికి గుండెలోరాయిపడ్డట్టూ, గొంతులో పచ్చి వెలగకాయ చిక్కుకున్నట్టూ ఇంకా అలాటివి చాలా చాలా అనిపించింది.

అతి ప్రయత్నం మీద ముఖాన నవ్వు అతికించుకుంటూ "పాలు వచ్చే టైముకూడా అయింది. సంధ్యను లేపుతానుండమ్మా" అంటూ గడుగ్గాయి స్టూడెంట్స్ వున్న క్లాసుకు వెళ్ళే లెక్చెరరులా బరువుగా భారంగా అడుగులు వేస్తూ పడకగదివైపు నడిచాడు శ్రీపతి.

కాలేజీ వదిలేముందు మాస్టార్లకందరికీ ఫేర్‌వెల్ పార్టీ ఇచ్చేరోజున అతివినయంగా ప్రేమగా వుండే విద్యార్థిలా ప్రసన్నవదనంతో ఎదురయింది సంధ్య.

శ్రీపతిని దాటుకుని ముందుకు వస్తూ "వెంకటాద్రిలో వచ్చేరా అత్తయ్యా? ఉత్తరం రాస్తే స్టేషనుకు వచ్చేవాళ్ళం కద? ఏవమ్మా ఏమైనా విశేషమా ఏమిటి? హఠాత్తుగా వచ్చారు?" అంటూ ఏక కాలంలోనే అత్తగార్ని ఆడబిడ్డనూ పలకరించేసి "మీరు ముఖం కడుక్కోండి మావయ్యా. డికాక్షన్ దిగేసరికి పాలబ్బాయి వస్తాడు." అనేసి చెంగు నడుము చుట్టూ చుట్టి తన సామ్రాజ్యంలోకి వెళ్ళిపోయింది సంధ్య.

శ్రీపతి మనసు తేలికపడింది.

అసలు ముందురోజు రాత్రి తగవుకు మూలకారణం 'మీ వాళ్ళూ, మావాళ్ళూ' అన్న విషయమే. పండక్కి రమ్మని పిల్చిన మావగారు షర్టుగుడ్డ చదివించి చేతులు దులిపేసుకున్న వైనం గురించి కాస్త ఎత్తి పొడుపుగా మాట్లాడేడు శ్రీపతి. అది శ్రీమతిని వుడికిద్దామనే చిలిపి కోరికతో చేసినదే గానీ అత్తవారింటి నుండి పెట్టుపోతల నాశించిన వాడు కాదు శ్రీపతి.

ఆ సరసం విరసంలోకి దారితీసి పెళ్ళిలో మగపెళ్ళివారి ఆగడాలనూ అలుకలనూ గుర్తుచేసి అంతటితో ఆగక, 'తన తండ్రి గనుక పెళ్ళయిన రెండేళ్ళలో నాలుగు పండుగలకు పిలిచి బట్టలు పెట్టేడనీ, ఆయనగారి తలితండ్రులు ఇంతదాకా తన ముఖాన ఒక జాకెట్టు ముక్కైనా కొట్టలేదని' దెప్పి పొడిచి ముక్కు చీదుకుంది సంధ్య.

మావాళ్ళేదో గతిలేని వాళ్ళన్నట్టు మాట్టాడితే సహించేది లేదని అతనూ, మావాళ్ళను అంటే మాత్రం పడి వూరుకుంటానా అని ఆవిడా మాటలు విసురుకుని రుసరుసలాడబట్టే ఎడముఖం పెడముఖంగా నిద్రపోయేరు.

అమ్మా నాన్నలను చూడగానే శ్రీపతి గుండె దడదడలాడిందంటే కారణం ఇదే. వాళ్ళను చూడగానే అసలే పొడవైన ముక్కును మరికాస్త పొడవుగా చేసుకుని

మూతి బిగించుకుంటుందేమో సంధ్య అని భయపడ్డాడు శ్రీపతి.

అయితే లేటుగా క్లాసుకు ఎందుకు వెళ్ళావంటూ మెమో ఇవ్వడానికి పిలిచిందేమోననుకున్న పురుష పక్షపాతం గల ఆడ ప్రిన్సిపాలు, 'కట్టుకున్న చీరె ఖరీదెంత?' అని అడిగి పంపితే కుట్టి మేడమ్ ముఖంలో కనబడేంత ప్రసన్నతతో సంధ్య అత్తా మామలను పలకరించేసరికి భార్య పట్ల ప్రేమ గుండెలో పొంగిపొర్లిపోయి చోటు చాలక చిరునవ్వు రూపంలో బయటపడింది.

"ఏమ్మా ఈసారయినా పెళ్ళికొడుకుకు వంక పెట్టకుండా ఒప్పుకుంటావా? నీ పెళ్ళిపేరు చెప్పుకుని 'బాటా' కంపెనీ వాళ్ళు బాగుపడిపోతున్నారు" అంటూ చెల్లెల్ని తమాషా చేసాడు.

"చెల్లి పెళ్ళికి నీ కోడలికి పట్టు చీరె పెట్టకపోతే వూరుకోదమ్మా" అంటూ తల్లికి సరదాగా వార్నింగు ఇచ్చేసి ఓరగా సంధ్యకేసి ఓ చూపు విసిరాడు.

"ఆయన మాటలకేంలెండి. ముందు మా ఆడబడుచుకు నచ్చే నవ మన్మధుడు దొరికితే చాలు." ఘుమఘుమ లాడుతున్న చిక్కని కాఫీ అత్తగారికీ మావగారికీ, ఆడబడుచుకూ అందిస్తూ అంది సంధ్య.

"మా అన్నయ్య నవ మన్మధుడనే కదమ్మా ఒదినా నువ్వు చేసుకున్నదీ?" అంతదాకా కాస్త సిగ్గుగా కూర్చున్న ఆడబడుచు వదినగారికి చురుగ్గా జవాబిచ్చింది.

"అవునవును." కాలరు సరిచేసుకుంటూ గర్వంగా భార్య వైపు చూసాడు శ్రీపతి.

"మీ అన్నయ్య మన్మధుడైతే ఆయన పెళ్ళాడిన నేను రతీదేవినే కాదుటమ్మా మరి?" సంధ్య నవ్వేస్తూ అంది.

సరదాలతో చమత్కారాలతో, చతురోక్తులతో ఇల్లు కలకలలాడింది.

భోజనాలయ్యాక అత్తాకోడలూ కలిసి సాయంత్రానికి కావలసిన ఫలహారాలు తయారు చేసారు.

రాత్రి నిద్రలేకపోయినా, ప్రొద్దుటి నుండీ వంచిన నడుము ఎత్తకుండా పనిచేస్తున్నా విసుగుగానీ అలసటగానీ చూపక బొంగరంలా తిరుగుతూ ఇల్లంతా అద్దంలా శుభ్రంచేసిన సంధ్యను చూస్తుంటే ఎంతో గర్వంగా మరెంతో సంతోషంగానూ వుంది శ్రీపతికి.

'చదువుకున్న పిల్లయినా నా కోడలు పనిమంతురాలు' అని తల్లి సంధ్యను మెచ్చుకుంటుంటే, 'వదిన మనసు మంచిది అన్నయ్యా కుళ్ళుకుచోద్యం తెలియవు తనకు' అంటూ చెల్లెలు ప్రశంశిస్తుంటే గుండె నిండుగా పెల్లుబుకుతున్న సంతోషంతోబాటు ఏదో చిన్న ముల్లు గుచ్చుకున్న బాధ కనీ కనిపించకుండా సలుపుతోంది శ్రీపతి మనసును.

తను మోజుపడికొనుకున్న గులాబి రంగుకు నలుపులో జరీ బార్డరున్న మైసూరు సిల్కు చీరెను ఆడబడుచుకు కట్టి, తనే జడఅల్లి అలంకారంచేసింది సంధ్య.

పెళ్ళిచూపులు ముగిసాయి. 'అమ్మాయి లక్షణంగా వుంది! అన్నారు చూడవచ్చినవారు.

"అబ్బాయికే కాస్త మెల్లకన్ను, ఎత్తుపళ్ళూ బట్టతలావున్నాయి" వాళ్లు వెళ్ళిపోయాక చెల్లెలితో అన్నాడు శ్రీపతి.

ఇది వరకు చూసిన మూడు సంబంధాలను ఆయా కారణాలతో తిరగ్గొట్టిందా పిల్ల. అందుకే ఆటలు పట్టించాడు శ్రీపతి.

"నువ్వప్పుడు చేసుకుంటానన్న బ్యాంకులో పనిచేసేదంత సుందరికన్న బాగున్నాడులే అన్నయ్యా.." శ్రీపతిని వెక్కిరించింది చెల్లెలు.

"అయితే కథా నాయకుడేనన్నమాట మీ అన్నయ్య. ఏదో ప్రవరాఖ్యుడనుకున్నాను. ఎవరా దంత సుందరి?" శ్రీపతివైపు చురుగ్గాచూసి ఆడబిడ్డ నడిగింది సంధ్య.

"హతోస్మి.. అచ్చులో పడని కథలురాసే రచయిత్రీ నాగురించి మాత్రం కథలల్లకు." చెల్లెల్ని బ్రతిమలాడేడు శ్రీపతి.

"ఉన్న విషయం చెప్పకపోతే ఇప్పుడు చూసి వెళ్ళిన అబ్బాయికి 'నీ మీసాలు మా పిల్లకు నచ్చలేదని' ఉత్తరం రాసేస్తాను జాగ్రత్త." సంధ్య బెదిరించింది.

"అంతపనిచేయకు ఒదినా! చిరంజీవిలాంటి చక్కని మీసాలున్నవాడు పాపం.. అన్నయ్య బ్యాంకులో ఓ ఎత్తుపళ్ళ వృద్ధ వనితకు నాలుగైదుసార్లు స్కూటరుమీద లిఫ్ట్ ఇచ్చాడు. అమ్మా నాన్నా ఠారెత్తిపోయి, 'ఆ పిల్లను చేసుకుంటాడేమో అని మీ సంబంధం చూసి పెళ్ళి ఏర్పాటు చేసేసారు. ఆవిడకు అన్నిసార్లు లిఫ్టెందుకిచ్చాడో ఆ సీక్రెట్ అన్నయ్యనే అడుగు." ముసిముసిగా నవ్విందా పిల్ల.

శ్రీపతి సిగ్గు పడ్డాడు. మళ్లాచెప్తాలే అంటూ సైగ చేసేడు.

కొఱ కొఱ చూసింది సంధ్య అన్నం తినడం మానేసి నీళ్ళ గ్లాసు చేతిలోకి తీసుకుంది చేయి కడుక్కుంటానన్నట్టు.

"మరేంలేదు.. అమ్మా నాన్నా నా పెళ్ళి గురించి ఏమీ అనుకోకుండా నిమ్మకు నీరెత్తినట్టుగావుండిపోతే కొంచెం షాకిద్దామని... అంతే... ఆవిడకు తర్వాత ఓ పెద్దాయనతో పెళ్ళికూడ అయిపోయింది నవ్వుతూ చెప్పాడు శ్రీహరి.

"అయితే మా ఆడబడుచుకు చిరంజీవి మీసాలు ప్రాప్తముంది పాపం" నవ్వేసింది సంధ్య.

"చిరంజీవిలాటి అను వదినా..." సరిదిద్దింది ఆడబడుచు.

"అవునుగానీ వదినా మాతో నువ్వు ఇంత సరదాగా కలిసిపోతావుగదా? మా అన్నయ్య మీ చెల్లెళ్ళతో వాళ్ళతో ఇలాగే వుంటాడా?" వదినవైపు కుతూహలంగా చూస్తూ అడిగింది శ్రీపతి చెల్లెలు.

శ్రీపతి ముఖం చిన్నబోవడం ఆపిల్ల గమనించలేదుగానీ అతగాడికేసి ఓరగా చూసింది సంధ్య.

"అమ్మాయ్ సంధ్యా! పాలు తోడు పెట్టావా?" అంటూ అత్తగారు వంటింట్లో నుండి పిలవడంతో 'వస్తున్నా నత్తయ్యా' అంటూ వెళ్ళింది సంధ్య.

పిల్ల నచ్చిందనీ పదిహేనురోజుల్లో తాంబూలాలు పుచ్చుకుందామనీ మగపెళ్ళివారు పంపిన కబురు అందుకుని మర్నాడు సాయంత్రం ప్రయాణమయ్యేరు

శ్రీపతి తల్లీతండ్రీచెల్లెలూ.

నెలాఖరు రోజులు గనుక ఎలాగో వాళ్ళ ప్రయాణం ఖర్చులకు మాత్రం ఏర్పాటు చేసిన శ్రీపతి వాళ్ళకు బట్టలు పెట్టలేకపోతున్నందుకు నొచ్చుకున్నాడు.

అతనితో ఆ విషయమే మాట్లాడకుండా వూరుకున్న సంధ్య వాళ్ళు బయల్దేరే ముందు తను కొనుకున్న చీరెలు అత్తగారికి ఆడబడుచుకు తాంబూలంలో పెట్టి ఇచ్చింది.

ఆరోజు రాత్రి భోజనాల దగ్గర భార్యా భర్తలిద్దరూ ముభావంగానే వున్నారు.

వంటింట్లో పనులు చక్కబెట్టుకుని వచ్చిన సంధ్య, కలిపి వేసిన రెండు మంచాలను గమనించనట్టే గోడ వైపుకు తిరిగి పడుకుంది.

పక్కనే వచ్చి కూర్చుని సంధ్య నడుము మీద చేయివేస్తూ "అయాం సారీ సంధ్యా" అన్నాడు శ్రీపతి.

"ఎందుకూ?" చురుగ్గా చూసింది సంధ్య "నిన్నరాత్రి దెబ్బలాడి నందుకు కాదు. ఇది వరకు మనం దెబ్బలాడుకున్నపుడు మీ చెల్లెలూ, మరిదీ వస్తే నేను ముభావంగా వున్నాను వాళ్ళతో. తర్వాతెప్పుడో నువ్వు చెప్పేవు. "'బావగారు ఎప్పటిలా సరదాగాలేరు అంది మా చెల్లెలు" అని. పెద్దగా పట్టించుకోలేదు నేను. గానీ ఈ రోజు అనిపించింది. అపుడు నేను ప్రవర్తించినట్టు ఇప్పుడు నువ్వు ప్రవర్తించివుంటే ఎంత బాధపడేవాడినో అని" శ్రీపతి గొంతు వణికింది.

సంధ్య జవాబు చెప్పలేదు. రెండుచేతులూ అతని మెడచుట్టూవేసి అతని ముఖాన్ని గుండెకదుముకుంది.

ఆ వెచ్చదనంలో కరిగిపోతూ "నువ్వూ+నేను =మనం" అస్పష్టంగా అన్నాడు శ్రీపతి.

• *A.I.R. Kurnool* •